

డిఎస్‌పిగా కృష్ణారావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-పాలకొండ

డిఎస్‌పిగా జివి కృష్ణారావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన డిజిపి కార్యాలయం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన డిఎస్‌పి ఎం.శ్రావణి డిజిపి కార్యాలయానికి అటాచ్ చేశారు. ముందుగా కోటదుర్గమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఎస్‌పి కృష్ణారావు

అధికారంలోకి వస్తే.. అవినీతి రహిత పాలన

- గుంకలాం జగనన్న కాలనీని సందర్శించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్
- వై జంక్షన్ నుంచి రోడ్‌షో
- రహదారి పొడవునా ఘన స్వాగతం





జనసేన అధినేతకు గజమాల వేసి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు, ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పవన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, కోట

జనసేన అధికారంలోకి వస్తే అవినీతి రహిత పాలన అందిస్తామని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. వైసిపి ప్రభుత్వం అన్నింటా అక్రమాలకు పాల్పడుతోందన్నారు. గుంకలాం వద్ద జగనన్న కాలనీలో చేపడుతున్న మౌలిక సదుపాయాలు, జిల్లాలో చేపట్టిన భూమి కొనుగోల్లో కూడా భారీఅవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. ప్రభుత్వ సహకారం పెద్దగా లేకపోవడం వల్ల పేదలు ఇళ్లు కూడా నిర్మించుకోలేకపోతున్నారని అన్నారు. జగనన్న ఇళ్లు.. పేదలకు కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా గుంకలాం వద్దనున్న జగనన్న కాలనీని ఆదివారం ఆయన సందర్శించారు. ముందుగా వైజంక్షన్ నుంచి ఎత్తుబ్రిడ్జి, ఆర్అండ్‌బి, కలెక్టరేట్, కెఎల్‌పురం, గొల్లం మీదుగా రోడ్‌షో నిర్వహించారు. పవన్‌కు అడుగడుగునా ఆ పార్టీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కలెక్టరేట్ కూడలి వద్ద బిజెపి కార్యకర్తలు కూడా జైకొట్టారు. జగనన్న ఇళ్లు.. పేదలకు కన్నీళ్లు అంటూ పలువురు ప్లకార్డులు ప్రదర్శించారు.

మధ్యాహ్నం 1:30 గంటలకు గుంకలాం జగనన్న కాలనీకి చేరుకున్న ఆయన పలు ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం కాలనీ సమీపంలో ఫ్లైలాన్ వద్ద కారు ఓపెన్ టాప్‌పై అక్కడున్న వారినుద్దేశించి మాట్లాడారు. ఈ కాలనీ అభివృద్ధి చేసిన సొమ్ము మంత్రి బొత్స, ఇతర వైసిపి నాయకుల జేబు సొమ్ముకాదన్నారు. ప్రజలు కష్టపడి చెమటోడ్చిన డబ్బులను కాజేస్తే ఊరుకునేది లేదన్నారు. ఇళ్ల స్థలాల కొనుగోళ్లలోనూ భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని అన్నారు. కరోనా వంటి కష్టాలంలో కూడా ఇసుక దోపిడీ ఆపలేదని, ఇప్పటికీ అదే పరిస్థితి ఉండడం వల్ల ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారని చెప్పారు. విశాఖ కేంద్రంగా ఉంటూ తాను ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలు, కష్టనష్టాలు బాగా తెలుసుకున్నానని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఇస్తున్న ఎంగిలి మెతుకుల వల్ల ఈ ప్రాంతం ఆకలిబాధలు తీరే పరిస్థితి లేదన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఎంతోమంది ఎదురు చూస్తున్నారని, తాను అధికారంలోకి వస్తే ఒక్కొక్కరూ పది మందికి ఉపాధి చూపే విధంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. అధికార పార్టీ బెదిరింపులు, అదిరింపులకు జనసేన వెనుకాడేది లేదన్నారు. తన కోసం రోడ్‌షోలో 14 కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వచ్చిన యువకులు అవినీతి, అక్రమాలపై నిలదీయలేరా? అని ప్రశ్నించారు. తన కోసం రాజకీయం చేయడం లేదని, పేదల కోసం ఉన్న ఆవేదన, ఆక్రోశం వెళ్లబుచ్చేందుకే గొంతెత్తుతున్నానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పిఎసి సభ్యులు కోన తాతారావు, ప్రధాన కార్యదర్శులు పాలవలస యశస్విని, టి.శివశంకర్, బొబ్బిలి సత్య, నాయకులు సుందరపు విజయ్‌కుమార్, పరుచూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : జిల్లా పర్యటనకు వచ్చిన జనసేనాని పవన్ కల్యాణ్‌కు మండలంలోని రాజాపులోవ, జొన్నాడ వద్ద ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. జొన్నాడ వద్ద పవన్‌కు క్రేన్‌తో గజమాల వేసి, స్వాగతించారు. ఈ కార్యక్రమంలో భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ, నెల్లిమర్ల నాయకులు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలు నిరాధారం : జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం ప్రతినిధి : జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు నిరాధారమైనని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. చేతనైతే ఎక్కడ? ఎవరు? ఏ రూపంలో అవినీతికి పాల్పడ్డారో నిరూపించాలని సవాలు చేశారు. జెడ్‌పి సమావేశ మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం ఉమ్మడి జిల్లాలో 99,139 మందికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయని చెప్పారు. ఇప్పటివరకు సుమారు 5వేల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా, 2500 ఇళ్లు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. ఆయా కాలనీల్లో రూ.574 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తున్నామని వివరించారు.

ఐక్యంగా పోరాడాలి

ఉద్యమాలతోనే ప్రభుత్వ మెడలు వంచుతాం

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా మహాసభలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెంకటరెడ్డి

ప్రజాశక్తి- పాలకొండ రూరల్/పాలకొండ

రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మున్సిపల్ కార్మిక కార్మికులపై అవలంభిస్తున్న విధానంపై భవిష్యత్తులో ఐక్యపోరాటాలు నిర్వహిస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీకోటదుర్గ కళింగకోమటి కల్యాణ మండపంలో ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా 3వ మహాసభలు ఆదివారం జరిగాయి. ముందుగా 3వ జిల్లా మహాసభలకు సూచికగా జెండాను యూనియన్ సీనియర్ సభ్యులు పడాల ఇప్పలమ్మ ఆవిష్కరించారు. అనంతరం మహాసభకు పాలకొండ మున్సిపల్ కమిటీ గౌరవ అధ్యక్షులు దావాల రమణారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పాలకొండ, పార్వతీపురం, సాలూరు ప్రాంతాల్లో లక్షా 80వేల మంది ప్రజలకు పారిశుధ్యం, ఇంజనీరింగ్ విభాగాల్లో 430 మంది కార్మికులు పౌరసేవలు అందిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు మర్చిపోయి అదనపు భారాలు వేస్తుందని విమర్శించారు. ఆప్కాస్ మూలంగా వస్తున్న సమస్యలపై పోరాటాలు ఉధృతం చేసి, పర్మినెంట్ కోసం, కార్మికుల పెంపునకు ఐక్యపోరాటాలకు వెళ్లాలన్నారు. కార్మికుల హక్కులపై ప్రధాని నరేంద్ర మోడీ నాశనం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అందుకు మద్దతు తెలపడం దారుణమన్నారు. అటువంటి విధానాలు ఆపాలని, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరాడుతామని హెచ్చరించారు. ప్రభుత్వం హామీలు తప్ప సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. మున్సిపాల్టీల్లో జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచడం లేదన్నారు. కార్మికులు ప్రమాదకరమైన వాయువుల మధ్య పనిచేసి అనారోగ్యం పాలవుతున్నాం అన్నారు. కార్మికులు సక్రమంగా పనిచేయాలంటే మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, అందుకు సరిపడా వేతనాలుండాలని అన్నారు. ఐక్యపోరాటాలతో కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు గడిచిన మూడేళ్లలో జరిగిన పోరాటాల నివేదికను ప్రవేశపెట్టారు. సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మిక వ్యతిరేక విధానాలపై అధికారులు, ప్రభుత్వంతో కార్మికుల పక్షాన పోరాడుతున్నామన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు రూ.21వేలు వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, మరణించిన కార్మిక కుటుంబాల్లోని వ్యక్తులకు ఉద్యోగాలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, పాలకొండ, పార్వతీపురం, సాలూరు పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా సిబ్బందిని పెంచాలని తదితర డిమాండ్లను మహాసభలో తీర్మానం చేశారు. మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.వెంకటరమణ, వై.మన్మథరావు, గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతి రావు, అంగన్వాడీ, ఆశా, ఆటో వర్కర్స్ నాయకులు అమరవేణి, పి.లక్ష్మి, కాద రాము, మున్సిపల్ జిల్లా నాయకులు పి.భాస్కరరావు, సిహెచ్ సంజీవి, సింహాచలం, మల్లేసు, టి.రాముడు, టి.శంకరరావు, శ్రామిక మహిళ టి.ఇందు, కార్మికులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షులు వెంకటరెడ్డి

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



శంకరరావు



ఎన్‌వై నాయుడు

జిల్లా మహాసభలో 15 మందితో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా నాగవంశం శంకరరావు, కార్యదర్శిగా ఎన్‌వై నాయుడు, సహాధ్యక్షులుగా పి.భాస్కరరావు, ఎన్.మల్లేష్, టి.రాముడు, టి.ఇందు, సహ కార్యదర్శులుగా పి.వేణు, సింహాచలం, టి.శంకరరావు, టి.వెంకటరావు, కోశాధికారిగా సిహెచ్ సంజీవి, కమిటీ సభ్యులుగా టి.రవి, వై.హరిబాబు, వరదరాజులు, క్రాంతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహిళా సబ్‌కమిటీ

కన్వీనర్‌గా టి.ఇందు, కో-కన్వీనర్లుగా ఎన్.నిర్మల, శ్రీదేవి, సభ్యులుగా జి.స్వప్న, చిన్నమ్మలు, విమల తదితరులను ఆరుగురితో సబ్‌కమిటీని ఎన్నుకున్నారు.



సంతకం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు మురళీమోహనరావు

కార్పొరేట్లకు లాభాన్ని చేకూర్చే

సిపిఎస్, జిపిఎస్‌ను అంగీకరించం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

సిపిఎస్, జిపిఎస్ కార్పొరేట్లకు లాభాన్ని చేకూర్చే విధానాలని, వీటిని యుటిఎఫ్ అంగీకరించదని, ఒపిఎస్ మాత్రమే ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు అంగీకారమని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని యుటిఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా శాఖ ఆధ్వర్యంలో బెలగాం చర్చి సెంటర్ జంక్షన్ వద్ద చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిపిఎస్ ఉంచాలా? ఒపిఎస్ ఉంచాలా అనేది రాష్ట్ర ప్రభుత్వ ఇష్టమని ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ఆర్థికశాఖామంత్రి సీతారామన్ మాట్లాడడం దారుణమని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు మాట్లాడుతూ సిపిఎస్‌పై భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని, దీనిలో భాగంగా సిపిఎస్ ఇంటికి, 10కె, 5కె సదస్సులు డిసెంబర్ నెలాఖరు వరకు జరుగుతాయని అన్నారు. జనవరి తర్వాత ఉద్యోగులు, ఉపాధ్యాయులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి.రమేష్, కార్యదర్శులు ఎ.భాస్కరరావు, పైడిరాజు, ఎన్.శ్రీనివాసరావు, గోవిందమ్మ, మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సంతకాల సేకరణలో జెఎసి అధ్యక్షులు కిషోర్, హెచ్‌ఎం సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లతో రైతులకు పనిలేదు

- సమాచారమిస్తే ప్రతి గింజా కొనుగోలు చేస్తాం
- కొనుగోలు బాధ్యత ఆర్‌బికెలదే
- శిక్షణతో కూడిన సిబ్బంది నియామకం
- కళాసీ, ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు అడిగితే ఫిర్యాదు చేయొచ్చు
- 3.18లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- ప్రజాశక్తితో సివిల్ సప్లై డిఎం ఎం.దేవుల నాయక్ ముఖాముఖి





ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు మిల్లర్లతో పనిలేదని, ఆర్‌బికెలకు సమాచారం అందిస్తే ఇక్కడ నియమించిన సిబ్బంది నేరుగా కళ్లాలకు వచ్చి ధాన్యాన్ని తీసుకెళ్తారని పార్వతీపురం మన్యం జిల్లా సివిల్ సప్లై డిఎం ఎం.దేవుల నాయక్ అన్నారు. రైతులు కేవలం తూకం సరిచూసుకుని, అక్కడికక్కడే రసీదు పొందితే సరిపోతుందని అన్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 3.18లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు లక్ష్యంగా తీసుకున్నామని చెప్పారు. ఆర్‌బికెలు కేంద్ర బిందువుగా కొనుగోలు జరుగుతాయని, ఆయా కేంద్రాల్లో శిక్షణతో కూడిన సిబ్బందిని ఇప్పటికే నియమించామని తెలిపారు. కళాసీ, ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. గోనె సంచులు ప్రభుత్వం నుంచి అందుతాయని, ఒక వేళ రైతులే గోనెలతో తీసుకుంటే వాటికి కూడా ప్రభుత్వం నగదు చెల్లిస్తుందని తెలిపారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

ధాన్యం కొనుగోలులో ఈ ఏడాది అనుసరిస్తున్న నూతన విధానం ఏమిటి?

ఆర్‌బికెలను క్లస్టర్ల వారీగా విడగొట్టి, శిక్షణతో కూడిన సిబ్బందిని నియమించాం. శాంపిల్స్ సేకరణ మొదలుకుని, గ్రేడింగ్, తూకం, మిల్లర్లకు అప్పగించే వరకు వీరిదే బాధ్యత. రైతులు కేవలం ఆర్‌బికెలకు అప్పగించి, తూకం సరిచూసుకుని, రసీదు పొందినంత వరకే.

ఎన్ని క్లస్టర్ల ద్వారా ధాన్యం సేకరిస్తారు?

జిల్లా వ్యాప్తంగా 206 ఆర్‌బికెలు ఉన్నాయి. వీటిని ఎ,బి,సి కేటగిరిలుగా విభజించాం. 2వేల మెట్రిక్ టన్నులు పైబడి ధాన్యం ఉన్న ఆర్‌బికెలను ఎ-కేటగిరిలోను, వెయ్యి పైబడినవి బి కేటగిరిలోను, వెయ్యిలోపు గల వాటిని సి కేటగిరిలోనూ చేర్చాం. ఎ,బి కేటగిరి ఆర్‌బికెల్లో యథాతథంగా ధాన్యం సేకరిస్తారు. 'సి' కేటగిరి విషయంలో రైతుల సౌలభ్యం, ధాన్యం ఉత్పత్తిని బట్టి కొన్ని ఆర్‌బికెలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేశాం. మొత్తం అన్ని కేటగిరిలు కలుపుకుని 190క్లస్టర్లు ఏర్పాటు చేశాం.

సిబ్బంది, గ్రేడింగ్ పరీక్షలు సంగతులేంటి?

ప్రతి క్లస్టర్‌లోనూ 3 నుంచి 4మంది వాలంటీర్లు, టెక్నికల్ అసిస్టెంట్, కస్టోడియన్ ఆఫీసర్లను నియమించాం. వాలంటీర్లలో ఒకరు రూట్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. మిగిలినవారు రైతులు- క్లస్టర్లకు మధ్య సంధాన కర్తలుగా వ్యవహరిస్తారు. ఇప్పటికే వీరికి శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. ధాన్యం నాణ్యతకు సంబంధించి కొనుగోలు కేంద్రాల్లో ఐదు రకాలైన పరీక్షలు చేస్తాం. వీటికి సంబంధించిన పరికరాలన్నీ ఆయా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయి.

ఈ ఏడాది ధాన్యం కొనుగోలు లక్ష్యం ఎంత?

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 3.18లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తాం. గత ఏడాది ఇదే 15మండలాల్లో 2.20లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాం. ఈ ఏడాది రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

జిల్లాలో ఎన్ని మిల్లులు ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా 93ధాన్యం మిల్లులు ఉన్నాయి. కానీ, వీటిలో 30మిల్లుల్లోనే సార్టెక్స్ యంత్రాలు ఉన్నాయి. వీటికి మాత్రమే ధాన్యం అప్పగిస్తాం. మిగిలిన మిల్లుల్లో త్వరలో సార్టెక్స్ యంత్రాలు పెట్టే అవకాశం ఉంది. అర్హత పొందాక వాటికి కూడా అవకాశం కల్పిస్తాం. మిల్లర్లు ఇప్పుడిప్పుడే బ్యాంకు గ్యారెంటీలు చెల్లిస్తున్నారు.

రైతులు ఎవర్ని సంప్రదించాలి?

ధాన్యం క్రయం కోసం రైతులు నేరుగా ఆర్‌బికెలను సంప్రదిస్తే చాలు. అక్కడి సిబ్బంది శాంపిల్స్ తీసుకొని, విక్రయానికి సంబంధించిన షెడ్యూల్ ఇస్తారు. దాని ప్రకారం రైతుల కళ్లాలకే వాహనాలు వస్తాయి. వాటిని నేరుగా క్లస్టర్లకు తెప్పించుకునే బాధ్యత సిబ్బందే చూసుకుంటారు. రైతులు తూకం సరిచూసుకుని అక్కడికక్కడే రసీదులు పొందవచ్చు. సేకరించిన ధాన్యం వివరాలను సిబ్బంది కంప్యూటర్ పొందుపర్చగానే సెల్‌ఫోన్‌కు ఓటిపి వస్తుంది. దాని ఆధారంగానే ఆ ధాన్యాన్ని సిబ్బంది మిల్లుకు పంపుకుంటారు. కాబట్టి ఏ రైతు ధాన్యం ఏ మిల్లుకు వెళ్లాలనేది కంప్యూటరే నిర్ణయిస్తుంది. కాబట్టి రైతులు- ధాన్యం కొనుగోలు మధ్య దళారులుగానీ, వ్యాపారులుగానీ ఉండేందుకు అవకాశం లేదు.

కళాసీ, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు ఎవరు భరించాలి?

ధాన్యం క్రయ విక్రయాల్లో కళాసీ, ట్రాన్స్‌పోర్ట్ ప్రక్రియ సర్వసాధారణంగా ఉంటుంది. ఆయా ఛార్జీలు రైతులు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వమే చెల్లిస్తుంది. గన్నీ బ్యాగులు మొదలుకుని, ఈ రెండు రకాల ఛార్జీలు వాలంటీర్లే ఏర్పాటు చేసుకుంటారు. ఎవరైనా కళాసీ, ట్రాన్స్‌పోర్టు వసూళ్లకు డిమాండ్ చేసినా, తూకంలో తేడా చూపినా వెంటనే నేరుగా అధికారులకు ట్రోల్ ఫ్రీ నంబర్ 09963-293037, 77022003582 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు.

ఘనంగా నారంశెట్టి బాలసాహిత్య పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పట్టణానికి చెందిన 'నారంశెట్టి బాలసాహిత్య పీఠం' ఆరో వార్షికోత్సవ సభ స్థానిక కళింగ వైశ్య కల్యాణ వేదికలో ఆదివారం జరిగింది. పీఠం అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు సభకు అధ్యక్షత వహించి తొలుత ప్రసంగించారు. గత ఆరేళ్లుగా తమ పీఠం బాలసాహిత్య అభివృద్ధికి పాటుపడుతూ బాల సాహితీవేత్తలను, సాహిత్యాన్ని ప్రోత్సహించిందని అన్నారు. ఈ ఏడాది ఇద్దరు బాలసాహితీవేత్తలకు నారంశెట్టి బాలసాహిత్య పురస్కారాలను ప్రదానం చేయడమే కాకుండా వివిధ రంగాలకు చెందిన తొమ్మిది మంది ప్రముఖులకు ఉత్తరాంధ్ర ఆణిముత్యం పేరుతో సత్కరించామని తెలిపారు. ముఖ్యఅతిథి ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ నేటి సాహిత్యం శ్రమ శక్తిగా ఉన్న మానవుణ్ణి ఉత్పత్తి శక్తిగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తుందన్నారు. మానవ సంబంధాల్లో యజమాని-బానిస విధానం పోవాలని, స్త్రీ పురుషులు మాత్రమే కాదు, మనుషులంతా సమానులుగా మారాలని వాంఛిస్తుందని, మనతరం సృష్టిస్తున్న సాహిత్యం జనజీవనాన్నే కాదు, మానసిక వికాసాన్ని కలిగించాలని తెలిపారు. ఉత్తరాంధ్ర సాహిత్యం గురజాడ నాటకంగా, శ్రీశ్రీ కవిత్వంగా, కారా, చాసో కథానికగా, గిడుగు వ్యావహారికంగా, సర్వాంధ్ర దేశాన్ని శాసించిందని కొనియాడారు. సాహిత్య సష్టితో ఉత్తరాంధ్రం ఉజ్జ్వలమవుతూ ఉందనీ, బాలసాహిత్యంలో నారంశెట్టి ఉమామహేశ్వరరావు తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం పొందిన ఉత్తమ రచయిత అనీ, గొప్ప కథలు, నవలలు రాసి చిరంజీవుల్ని మానసికంగా దీప్తిమంతులు కావడానికి కృషి చేశారని అభినందించారు. నారంశెట్టి బాలసాహిత్యపీఠం పక్షాన మంచి సాహిత్య వాతావరణం కల్పిస్తున్నారని అభినందించారు. కనువిప్పు కథలు వనదేవత తీర్పు కథలు ఇవాళ ఆవిష్కరించిన వీరి పుస్తకాలు చదివానని, చిరంజీవులకు బుద్ధి కుశలత ఈ పుస్తకాలు కలిగిస్తాయని చెప్పారు. బాలబాలికలు ఈతరం కుర్రాడులా, బుద్ధిబలంతో తనను తానే కాక, తన తోడి వాళ్లను రక్షించే శక్తి సంపన్నులు కావాలని కోరారు. గొప్ప మానవత్వపు విలువలు ప్రతిష్టిస్తున్న ఉత్తరాంధ్ర సాహిత్యానికి సాహిత్య స్రష్టలకు శుభాకాంక్షలు అన్నారు. అనంతరం కొసరాజు సురేష్ బాల సాహిత్యంలో మంచి పుస్తకం చేస్తున్న కృషికి అవార్డుతో సన్మానించిన నారంశెట్టి బాల సాహిత్య పీఠానికి ధన్యవాదాలు తెలిపారు. తెలుగులో పిల్లలకు పఠనాసక్తిని, పఠనా సామర్థ్యాన్ని పెంపొందించడానికి మంచి పుస్తకం పని చేస్తోందన్నారు. పిల్లల పట్ల బేషరతు ప్రేమ, అచంచల విశ్వాసం ఉండాలని అన్నారు.

బాలసాహిత్య పురస్కారాల ప్రదానం

2022 సంవత్సరాలకు నారంశెట్టి బాలసాహిత్య పురస్కారాలను ఇద్దరు ప్రముఖ బాల సాహితీవేత్తలు బెహరా ఉమామహేశ్వరరావు, కొసరాజు సురేష్‌కు ప్రదానం చేశారు. ఒక్కొక్కరికి రూ.5వేలు నగదు పారితోషికంతో పాటు, శాలువా, జ్ఞాపిక, సన్మాన పత్రాలతో ఘనంగా సత్కరించారు.

ఉత్తరాంధ్ర ఆణిముత్యం సత్కారం

వివిధ రంగాలకు చెందిన తొమ్మిది మంది ప్రముఖులను ఉత్తరాంధ్ర ఆణిముత్యం పేరుతో సత్కరించారు. వారిలో రౌతు వాసుదేవరావు (నటుడు, రచయిత, దర్శకుడు), టంకాల సుధాకరరావు (పత్రికా రంగం), బోనెల అసిరయ్య(జముకుల కుండ పాట), చింతా అప్పలనాయుడు (సాహిత్యం), మానాపురం రాజచంద్రశేఖర్(కవిత్వం), బాసంగి సురేష్ (నటనా రంగం), బొమ్మరిల్లు నాగేశ్వరరావు (వేదగణితం), సంకా గౌరీ శంకర నారాయణ(సామాజిక సేవ), బోటు రామకష్ణ(సామాజిక సేవ) ఉన్నారు .

పుస్తకాల ఆవిష్కరణ

పీఠం అద్యక్షులు నారంశెట్టి ఉమామహేశ్వరారవు రచించిన 'కనువిప్పు', 'వనదేవత తీర్పు' బాలల కథల సంపుటాలను ముఖ్య అతిథి కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. వాటితో పాటు పత్రాయుడు కాశీవిశ్వనాథం రచించిన కాశీ మామయ్య కథలు, బాసంగి సురేష్ రచించిన కవితా రేఖల సంపుటాన్ని అతిథులు ఆవిష్కరించారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఇనాక్, శ్రీరాములు, ఉమామహేశ్వరరావు

విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు బహుకరణ

వివిధ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు 'అంతర్జాల వినియోగం- ప్రయోజనాలు- దుష్పరిణామాలు' అన్న అంశంపై నిర్వహించిన వ్యాస రచనల పోటీల్లో ఆరు పాఠశాలల విద్యార్థులకు బహుమతులను, ప్రశంసాపత్రాలను బహూకరించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బెలగాం భీమేశ్వరరావు, డాక్టర్ డి.పారినాయుడు, డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, బాలబాట స్వరాజ్యమ్మ, తుంబలి శివాజీ, లంక వెంకటస్వామి, జెబి తిరుమలాచార్యులు, సిహెచ్.చినసూర్యనారాయణ, దేవులపల్లి పద్మజ తదితరులు మాట్లాడారు. సినీగాయకుడు అసిరయ్య పాడిన పాటలు , చిన్నారి రితిక్ రెడ్డి చేసిన నెహ్రు మీద ప్రసంగం పలువురిని ఆకట్టుకున్నాయి. రెండు రాష్ట్రాల నుండి విచ్చేసిన సాహితీవేత్తలతో సభ నిండుదనం సంతరించుకుని విశేషంగా ఆకర్షించింది. పలువురు ప్రముఖులు ప్రసంగిస్తూ నారంశెట్టి బాలసాహితీ సేవలను కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని అభిలషించారు.

ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యత అప్పగించొద్దు

ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్

పాలకొండ రూరల్: బోధన విషయం తప్ప మిగిలిన బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని ఎస్ టి యు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను మానసిక అశాంతికి గురి చేసే చర్యలను తక్షణమే ఆపి వేయాలని కోరారు. ఆదివారం పాలకొండలో జరిగిన ఎస్‌టియు పార్వతీపురం మన్యం జిల్లా శాఖ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు జీతాలు సకాలంలో చెల్లించాలని, వారు దాచుకున్న పొదుపు డబ్బులు పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ లోన్లు వెంటనే చెల్లించాలని, సరెండర్ లీవ్ బిల్లు ఏడాది పూర్తయిన ఇంకా చెల్లించకపోవడం శోచనీయమని అన్నారు. బదిలీలు వెంటనే నిర్వహించి, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు స్థానాలను కేటాయించాలని కోరారు. చిన్న చిన్న కారణాలతో ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ మానసిక శాంతి గురిచేయడం తగదని అన్నారు. ఈ సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లా శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా అవిభాజ్య శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ఎస్ శ్రీనివాస్ పట్నాయక్, ప్రధాన కార్యదర్శిగా కె.ప్రమోద్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా కృష్ణకుమార్, అదనపు ప్రధాన కార్యదర్శిగా కె.కాంతారావు, అసోసియేట్ అధ్యక్షులుగా ఎ. కేశవరావును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి. ప్రభాకరరావు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, డి. శ్యామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న చిన్నారులు, ఉపాధ్యాయులు

ఘనంగా నెహ్రూ జయంతి

సాలూరు : భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక వెంకట విద్యాగిరి పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోడూరు సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో నెహ్రూ జైలు జీవితాన్ని అనుభవించారని చెప్పారు. ఆయనకు చిన్నపిల్లలంటే అమితమైన ప్రేమ అని చెప్పారు. పంచవర్ష ప్రణాళికలను రూపొందించిన నెహ్రూ పాలనలో అనేక సంస్కరణలు అమలు చేశారని కొనియాడారు.




మెట్టగూడ జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

పార్కుకు పర్యాటకుల తాకిడి

సీతంపేట: స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులతో తాకిడి పెరిగింది. కార్తీక మాసం ప్రారంభమై మూడో ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా పర్యాటకులు తరలివచ్చారు. రహదారిపై వాహనాలు బారులు తీరాయి. పార్కులో ఉన్న అందాలను పర్యాటకులు ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోట్ షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద విహార వద్ద డాన్సులు చేసి ఆనందంగా గడిపారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో రివ్వు రివ్వుమంటూ తిరిగారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

లబ్ధిదారులతో మాట్లాడితే తెలుస్తుంది

పార్వతీపురం రూరల్ : జగనన్న ఇళ్ల పురోగతి గురించి లబ్ధిదారులతో మాట్లాడితే తెలుస్తుందని, లేఅవుట్ల దగ్గర ప్రకటనలు ప్రదర్శిస్తే ఏం అర్థం కాదని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఆదివారం మండలంలోని కృష్ణపల్లిలో నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 17 ఎకరాల స్థలంలో 30 లక్షల 25 వేల ఇళ్ల నిర్మాణం చేపడుతున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో 11,783 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించగా అందులో 8వేలకు పైగా ఇళ్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. జనసేన నాయకులు నిజాలు గ్రహించలేని అజ్ఞానంలో ఉన్నారని, కాబట్టే వారికి అభివృద్ధి అర్థం కాదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.భార్గవలక్ష్మి, నాయకులు నాగేశ్వరరావు, రమేష్, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపసర్పంచ్

గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల

సీతానగరం : స్థానిక గ్రంథాలయంలో ఆదివారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా పెదబోగిలి ఉపసర్పంచ్ కె.అరవింద్ కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాల వారోత్సవాల్లో విద్యార్థులు పాల్గొని వారి నైతిక విలువలను పెంపొందించుకోవాలన్నారు. అలాగే వివిధ రకాల ఆట పోటీలు ఉంటాయని వీటిలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు బి.రామారావు, గ్రంథాలయ అధికారి ఎస్.వెంకట్రావు, సత్యనారాయణ, వెంకటనాయుడు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 14 నుంచి 20 వరకు వారం రోజుల పాటు స్థానిక గ్రంథాలయంలో 55వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి డొనక సుకన్య తెలిపారు. వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ డ్రాయింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పొంచి ఉన్న ప్రమాదం

మక్కువ : మండల కేంద్రం నుంచి చెముడు పంచాయతీకి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభం వల్ల ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ స్తంభం ఎప్పుడు ఏ క్షణాన పడుతుందో తెలియక వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రమాదాన్ని కాస్త ఆపేందుకు స్థానికులు విద్యుత్ స్తంభానికి పొడుగాటి కర్ర దాపు ఉంచారు. ఇలాంటి ప్రమాదకరమైన విద్యుత్ స్తంభాన్ని తక్షణమే అధికారులు స్పందించిసరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై వాలిపోయిన విద్యుత్ స్తంభం



గ్రామస్తులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

జగన్‌తోనే సంక్షేమం : రాజన్నదొర

మక్కువ : రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ఎన్నుకుంటే సంక్షేమం అలా కొనసాగుతుందని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. ఆదివారం కోన పంచాయితీ గోపాలపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సంక్షేమ పథకాలు అందుతున్న విధానాన్ని ప్రజలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు శ్రీనివారావు మండల వైసీపీ నాయకుడు రంగు నాయుడు స్థానిక సర్పంచ్ మహాలక్ష్మి గోపాలపురం నాయకుల్ కన్నం నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు

అయ్యప్పస్వామి పూజలో రాజన్నదొర

పార్వతీపురం టౌన్ : పట్టణంలో గల దుర్గ చెట్టు వద్ద అయ్యప్ప స్వామి ఆలయంలో సర్వమంగళ పీఠం వ్యవస్థాపకులు, నాడీ జ్యోతిష్యులు మురపాక కాళిదాసు యాజి ఆధ్వర్యంలో ఆదివారం జరిగే అయ్యప్ప స్వామి పడిపూజ, అంబలం పూజలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర పాల్గొన్నారు. అనంతరం దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో కొత్తగా నిర్మిస్తున్న శివాలయం, గోశాలలను పరిశీలించారు. ఆర్.సత్యనారాయణ రూ.2లక్షల 40 వేలు, అప్పలనాయుడు రూ.లక్షా 50వేలు రాజన్నదొర చేతుల మీదుగా ఆలయ నిర్వాహకులు కాళిదాసు యాజికి అందజేశారు.

నేడు ప్రభుత్వ పింఛనుదార్ల సమావేశం

పార్వతీపురం టౌన్ : ప్రభుత్వ పింఛనుదార్ల సమావేశం పట్టణంలో గల పింఛనుదార్ల సమావేశ మందిరం సోమవారం జరుగుతుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి డి.గణపతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి గరుగుబిల్లి, కొమరాడ, జియ్యమ్మవలస, పార్వతీపురం మండలాల్లో గల ప్రభుత్వ పింఛనుదారులంతా హాజరు కావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉద్ధృతం

మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి

ప్రజాశక్తి - సీతానగరం

సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉద్ధృతం చేయాలని ఎపి మధ్యాహ్న భోజనం పథకం కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.వరలక్ష్మి పిలుపునిచ్చారు. సీతానగరం హెచ్చ్ కాలనీలో ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం 3వ జిల్లా మహాసభ ఆదివారం జరిగింది. మహాసభకు ముందుగా స్థానిక హనుమాన్ జంక్షన్ నుంచి బజారు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెచ్చ్ కాలనీ వద్ద జరిగిన సభా ప్రాంగణం వద్ద యూనియన్ జెండాను వరలక్ష్మి ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షులు వై.శాంతికుమారి అధ్యక్షత జరిగిన సభలో వరలక్ష్మి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా అనేక కష్టనష్టాలు కోర్చి పథకాన్ని నిర్వహిస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. దేశంలో 20 లక్షల మంది రాష్ట్రంలో 89 వేల మంది ఈ పథకాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యా విధానం పేరిట పాఠశాలలను విలీనం చేసి నిర్వాహకుల సంఖ్యను తగ్గిస్తున్నాయన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారానికి వస్తే మధ్యాహ్నం భోజన నిర్వాహకులకు కనీసం రూ.5వేలు ఇస్తామని చెప్పి ఆ హామీ అమలు చేయలేదని ఆమె అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న కార్మిక చట్టాల్లో మార్పుల కారణంగా కార్మిక హక్కులు కాలరాస్తున్నాయని, ఇందుకు ఐక్య పోరాటాలే శరణమని ఆమె అన్నారు. హర్యానా, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో మధ్యాహ్నం భోజన కార్మికులకు రూ.7500 చెల్లిస్తున్నారని, మన రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదని వివరించారు. అంతేకాక ఈ పథకాన్ని అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని, దీనికి రూ.100 కోట్లు కేటాయించిందని అన్నారు. పేదల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టామని చెప్పిన ప్రభుత్వం ఈరోజు ఆ పేదలకు దూరం చేస్తుందని విమర్శించారు. కావున కార్మికులంతా ఐక్యమై ఈ పథకాన్ని కొనసాగించేలా, న్యాయమైన సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళా జిల్లా నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ కార్మికులపై రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పథకం కార్మికులకు యూనిఫాం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి, తులసి, మధ్యాహ్నం భోజనం పథకం నాయకులు పి.సావిత్రి, వి.లక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, భవన నిర్మాణ, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకులు ఆర్.రాము, ఆర్.ఈశ్వరరావు, జి.గంగునాయుడు, ఆర్.లక్ష్మునాయుడు, వివిధ ప్రాంతాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



సీతానగరంలో ర్యాలీ చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

మహాసభ అనంతరం మధ్యాహ్నం భోజన పథకం కార్మిక సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులుగా గెద్ద తులసి, కార్యదర్శిగా వై.శాంతికుమారి, ఉపాధ్యక్షులుగా జి.పద్మ, యు.లక్ష్మి, ఆర్.భారతి, రాజేశ్వరి, పావని, కళ్యాణితో పాటు 15 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



కొత్తగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తులసి, శాంతకుమారి



కబీర్‌కు నివాళ్లు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి, పట్టణ ప్రముఖులు

కబీర్‌షా సంగీత సేవలు గర్వకారణం

వజ్రోత్సవ సభలో మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి చెందిన కబీర్ షా ఆర్కెస్ట్రా కళారంగానికి చేసిన సేవలు ఈ ప్రాంతానికి గర్వకారణమని మాజీ ఎమ్మెల్సీ జి.సంధ్యారాణి అన్నారు. కబీర్ షా ఆర్కెస్ట్రా స్థాపించి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణితో సహా పలువురు పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. సంగీత రంగానికి కబీర్ షా ఆర్కెస్ట్రా చేసిన సేవలు అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా కబీర్ షా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1947లో కబీర్ షా అన్న హుస్సేన్ ఆర్కెస్ట్రాను స్థాపించారన్నారు. 2006 వరకు కబీర్ షా ఆర్కెస్ట్రా నిర్వహణ బాధ్యతలను చేపట్టారన్నారు. 2007 నవంబరు14న కబీర్‌షా మృతి చెందారన్నారు. తెలుగు గజిల్స్, లలిత గీతాలు వందల సంఖ్యలో ఆయన రాశారన్నారు. స్వరమిత్ర బిరుదు ని పూసపాటి చేత పొందారన్నారు. 2007నుంచి ఆయన కుమారుడు బాషా కబీర్ షా ఆర్కెస్ట్రా నిర్వహణ బాధ్యతలను చేపడుతున్నారన్నారు. ఏటా డిసెంబర్‌లో కబీర్ షా ఆర్కెస్ట్రా ఆధ్వర్యాన ఘంటశాల నిర్విరామ నీరాజనం పేరుతో ఘంటసాల వెంకటేశ్వరరావు పాడిన మధుర గీతాలు ఆలపించే కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. పట్టణ వైసిపి అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.గణేశ్వరరావు, డాక్టర్ ఎం.మోహనరావు పాల్గొన్నారు.

చుక్క నీరవ్వని జల జీవన్ మిషన్

ప్రజాశక్తి - వీరఘట్టం

జలజీవన్ మిషన్ ద్వారా ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా లక్షలాది రూపాయలు వెచ్చించి పనులు చేపట్టినప్పటికీ అవి వినియోగంలోకి తీసుకురాకపోవడంతో వేసిన పైపులు నిరుపయోగంగా మూలన పడి ఉన్నాయి. మండలంలోని చేబియ్యంవలస, కొంచ, తదితర గ్రామాల్లో మూడేళ్ల క్రితం లక్షలాది రూపాయలు వెచ్చించి జలజీవన్ మిషన్ ద్వారా పైప్ లైన్లు ఏర్పాటు చేశారు. పైప్ లైన్ల ఏర్పాటైతే చేశారు తప్ప వాటి నుంచి కనీసం చుక్కనీరు అందించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కొంచ గ్రామంల పైప్లైన్

ప్రస్తుతం మండలంలోని ఎనిమిది గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా రూ.78 లక్షలతో పైప్లైన్ ఏర్పాటు చేసేందుకు కాలువలు తవ్వుతున్నారు. అయితే ఆయా గ్రామాల్లో వండువ ఉపరితల రక్షిత మంచినీటి పథకం ద్వారా పైప్లైన్ ఏర్పాటు చేసినప్పటికీ అది మూడనాళ్ల ముచ్చటగా గ్రామాలకు నీరు వచ్చేదని ప్రస్తుతం ఏర్పాటు చేసిన పైప్లైన్ కూడా ఉత్సవ విగ్రహాలు దర్శనమిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో లక్షలాది రూపాయలతో నిర్మాణ పనులు చేపడుతున్న జలజీవన్ మిషన్ పనుల ద్వారా తాగునీరు వచ్చే అవకాశాల్లేవని స్థానికులు విమర్శిస్తున్నారు. కేవలం ప్రజాధనం వృథా చేయడానికి ఈ పనులు తప్ప ప్రజలు గొంతును తడిపేది అవకాశం లేదని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిఒ 52ను తక్షణమే రద్దు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

జిఒ 52ను తక్షణమే రద్దు చేయాలని ఏజెన్సీ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు గేదెల రవి డిమాండ్ చేశారు. స్థానిక సామాజిక భవన్లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకి, వడ్డెర, బెంతు ఒరియాలు, ఏ ఇతర కులాలను ఎస్టీలు జాబితాలో చేర్చవద్దని డిమాండ్ చేశారు. అభివృద్ధి చెందిన కులాలను ఎస్టీ జాబితాలు చేర్పించడం వల్ల నిజమైన ఆదివాసీలు అన్యాయానికి గురవుతారని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ శామ్యూల్ ఆనంద్ కమిషనను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 21న స్థానిక సామాజిక భవన్ నుంచి ఐటిడిఎ వరకు ఆదివాసీలతో నిరసన ర్యాలీ చేపడతామన్నారు. తక్షణమే ప్రభుత్వం ఏక సభ కమిషన్ రద్దు చేయకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెఎసి ప్రధాన కార్యదర్శి బి.ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు బిడ్డిక అప్పారావు, పాలక నాగేశ్వరరావు, మూటక రవి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ జెఎసి నాయకులు రవి



సందిగూడలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు పద్మావతి

వైసిపిపై ప్రజల్లో వ్యతిరేకత : టిడిపి

ప్రజాశక్తి- సీతంపేట

టిడిపి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పాలకొండ నియోజకవర్గం పరిశీలకులు కలమట సాగర్ అన్నారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో పాలకొండ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైసిపిపై వ్యతిరేకత ఉందన్నారు. నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ సవర భాషా వాలంటీర్లలకు ఇప్పటికీ జీతభత్యాలు లేవని, శాశ్వతంగా ఉద్యోగాలుగా అమల్లోకి తీసుకురాని పరిస్థితి ఉందని చెప్పారు. సీతంపేట ఆస్పత్రి, గర్భిణీ వసతి గృహాల్లో కనీసం భోజన సదుపాయం కూడా లేదన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు బిడ్డిక దమయంతినాయుడు, బిడ్డిక చంద్రరావు, సవరతోట ముఖలింగం, గేదల కాంతారావు, సర్పంచ్ సవర బాజన్న, బిడ్డిక మన్మధరావు, సవర సొడంగా, బిడ్డిక సుబ్బారావు, స్వామినాయుడు, నిమ్మక గంధర్వులు, సవర సూర్యం, నిమ్మక కృష్ణ, బిడ్డిక సోను, తిరుపతి, ఎద్దు శ్రీనువాసరావు, చంద్రశేఖర్, మురళి, సవర ప్రభాకర్, కూర్మారావు, మాసయ్య, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీ పురం ఏజెన్సీలో టిడిపి బలోపేతానికి కృషి చేస్తున్నట్లు సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి తెలిపారు. మండలంలోని దుమ్మంగి పంచాయతీ సంధి గూడలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజనులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి వస్తే గిరిజనుల కష్టాలు తీరుతాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బిడ్డిక కొండలరావు, బిడ్డిక సుధ తదితరులు ఉన్నారు.

ఉద్యోగోన్నతుల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - వీరఘట్టం

బదిలీలు, ఉద్యోగోన్నతుల కోసం ఉపాధ్యాయులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రక్రియను ప్రారంభించాలని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతల దుర్గారావు, జిల్లా అధ్యక్షులు అన్ను వెంకట్రావు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల విషయంలో కలుగజేసుకొని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పిఆర్‌సి, డిఎ, ఒపిఎస్ వంటి బెనిఫిట్స్ అందేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డీ పాపారావు, ఎ.చంద్రమౌళి, జి.దుర్గాప్రసాద్, ఎ.సూరి నారాయణ, డి.శ్రీనుబాబు, బి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

బొడ్లపాడులో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బొడ్లపాడులో శ్రీకాకుళానికి చెందిన జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరంలో 70 మందికి ఆప్తాల్మిక్ అధికారులు భవాని, అప్పలకొండ నేత్ర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శస్త్ర చికిత్స కోసం 30 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ కె.రమేష్, అసిస్టెంట్ మేనేజర్ పి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కె.ఇచ్చాపురంలో భజన గీతాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కె.ఇచ్చాపురంలో శ్రీఉమామహేశ్వర ప్రాంగణంలో ఈనెల 14న కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా అయ్యప్ప పూజ భజన, శివనామ కీర్తనలు చేయబడునని వీరఘట్ట శాస్త్ర సమాజం నిర్వాహకులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఔత్సాహికులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చున్నారు.



బిటివాడ పిహెచ్‌సి వద్ద నిరుపయోగంగా ఉన్న ట్యాంకులు

మూలనపడ్డ నీళ్ల ట్యాంకులు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద నీళ్ల ట్యాంకుల ఏర్పాటుకు ప్రభుత్వం వేలాది రూపాయలు వెచ్చించి ట్యాంకులు కొనుగోలు చేసింది. అయితే కొనుగోలు చేసిన ట్యాంకులను ఆయా పిహెచ్‌సిలకు తరలించాల్సి ఉండగా ఆ పనిచేయకపోవడంతో అవి వృథాగా బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మూలనపడి ములుగుతున్నాయి. ఈ నీళ్ల ట్యాంకులు చెడిపోవుక ముందే ఆయా ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేస్తే రోగులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నేరాలు ఘోరాలు

పిక్నిక్‌లో అపశృతి



భామిని : మండలంలోని నేరడి బ్యారేజ్ పరిధిలో కొంతమంది స్నేహితులు పిక్నిక్ వెళ్లారు. ఈ పిక్నిక్‌లో నేరడికు చెందిన సరిసభద్ర నారాయణరావు (38) బుల్లెట్‌పై తిరిగి వచ్చే క్రమంలో బోల్తాపడింది. దీంతో సంఘటనా స్థలంలోనే ఆయన కుప్పకులాడు. వెంటనే స్నేహితులు భామిని పిహెచ్‌సి తీసుకువచ్చే క్రమంలో మార్గమధ్యలో చనిపోయాడు. నారాయణరావుకు భార్య రజిని, పిల్లలు నవీన్, లక్ష్మి ఉన్నారు. బత్తిలి ఎస్ఐ సీతారాం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

పాచిపెంట మండలంలోని కూనంబందవలసకు చెందిన చీమల శశికుమార్ (25) చేపల వేటకు వెళ్లి మృతి చెంది. ఆదివారం ఆయన విశ్వనాధపుం వద్ద గల వేగావతిలో తన సోదరుడుతో పాటు మరికొంతమంది కలిసి చేపల వేట వెళ్లాడు. వేటాడే క్రమంలో నదిలో మునిగిపోయాడు. వెంటనే సహచరులు ఆయన్ను బయటకు తీసి సాలూరు సిహెచ్‌సికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హెచ్‌సి కృపారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శశికుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పాన్ షాప్ దగ్ధం

మక్కువ : స్థానిక పోలీస్ స్టేషన్ ప్రహరీ గోడకు ఆనుకొని ఉన్న ఒక పాన్ షాప్ ఆదివారం సాయంత్రం అగ్నికి ఆహుతైంది. షాప్‌పై భాగం నుంచి విద్యుత్ తీగ నుంచి మంటలు రావడంతో వెనుక భాగం నుంచి అంటుంది షాపు యజమాని ఎన్.రాజు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేల వరకు నష్టం జరిగినట్లు బాధితులు రోధిస్తున్నారు. ప్రమాదంలో తమ జీవనాధారాన్ని కోల్పోయామని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నర్సిపురంలో బస్సును ఢీకొన్న లారీ

పార్వతీపురంరూరల్ : మండలంలోని నర్సిపురం బస్టాప్ వద్ద ఆదివారం ఆగివున్న పల్లె వెలుగు బస్సును క్వారీ లారీ వెనుక నుండి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. బస్సు ఆగి ఉన్నందున ప్రమాదం తప్పిందని బస్ డ్రైవర్, స్థానికులు చెపుతున్నారు. దీంతో కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.



నర్సిపురం బస్టాప్ వద్ద బస్సును ఢీకొన్న లారీ



గతంలో అధ్వానంగా ఉన్న మామిడిపల్లి- చీపురువలస రోడ్డు

మామిడిపల్లి రోడ్డు నాడు-నేడు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలం లోని మామిడిపల్లి నుంచి శంబర వెళ్లే రహదారికి దాదాపు ఆరేళ్ల తర్వాత మోక్షం కలిగింది. మామిడిపల్లి నుంచి చీపురు వలస వరకు 8 కిలోమీటర్ల రహదారి గుంతలతో నిండి పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ రహదారిని రెండు రోజుల క్రితం బిటి రోడ్డుగా నిర్మించడంలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనేక ఏళ్లుగా నరకయాతన అనుభవించిన చీపురువలస గ్రామస్తులు ఒకానొక దశలో అటుగా వెళ్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొరను వారి గ్రామం వద్ద అడ్డగించి నిరసన తెలిపారు. ఏటా శంబర జాతర సమయంలో క్వారీ బుగ్గితో తాత్కాలికంగా రహదారి మరమ్మతు చేసి వదిలేసే వారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర అధికారులపై ఒత్తిడి పెంచి ఎనిమిది కిలోమీటర్ల రహదారిని యుద్ధప్రాతిపదికన నిర్మించేలా ఆదేశించారు. భారీ వర్షాలు పడినప్పుడల్లా ఈ రహదారి చెరువును తలపించేలా వుండేది. రెండు రోజుల క్రితం బిటి రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.



ప్రస్తుతం రోడ్డు పరిస్థితి